# జ్వరంతగ్గింది!

మానేపల్లి

**కృష్ణమూర్తికి** జ్వరం వచ్చి తగ్గింది.

జ్వరం అంటే జ్వరం కాదు. వారం రోజులు కాసింది. ఒంటిమీద తెలివి లేకుండా పడుకునేవాడు. కళ్ళ మంటలు, తల పోటు, ఒళ్ళు నొప్పులు... యమయాతన అనుభవించాడు. మాత్రలు మింగి మింగి అసహ్యం వేసింది. కనీసం పది ఇంజక్షన్లు పడి ఉంటాయి.

"ఏమిటీ జ్వర లక్షణం?" అని అడిగాడు డాక్టర్ని.

డాక్టరు ఏదో చెప్పాడు.

అతనికి సంతృప్తి కలగలేదు. చదువు రాని వాడు కనకనా, ఏదో ఒకటి చెబితే నమ్మడానికి?



'ఈ రోజుల్లో జబ్బులే అంతే. మాయదారి రోగాలు' అనుకున్నాడు. నిజానికి నిన్ననే టెంపరేచర్ నార్మల్‌కి వచ్చింది. ఆ మాట డాక్టర్ నోటంట విని పరమానంద పడ్డాడు.

"అన్నం తినొచ్చా?" అనడిగాడు ఆశగా.

"ఇవ్వాళ వద్దు. రేపు తిందురు కాని. ఇవాళ వేపుడు జావ, రొట్టె, పాలు, హార్లిక్సు, పళ్ళరసం— ఏవి తీసుకున్నా ఫరవాలేదు" అన్నాడు డాక్టరు.

"మాత్రలు మాత్రం మానకుండా వేసుకోండి" అనికూడా అన్నాడు.

'అన్నం తినకూడదు. మాత్రలు తినాలి' అని వినుక్కున్నాడు.

'వెధవ రొట్టె, వెధవ పాలు' అనేద్దా మనుకున్నాడు. లోపలి నుంచి పెదవుల దాకా వచ్చిన మాటల్ని ఆపుకున్నాడు.

రాజేశ్వరి పక్కనే ఉంది.

"అలాగే, డాక్టర్" అని తల ఆడించింది.

"పాపం! అన్నం తింటా నంటున్నారండీ" అని చెబుతుందేమో ననుకున్నాడు. ఉదయం గంటసేపు బోధ పరిచాడు.

"అలాగే లెండి. డాక్టర్ గారొస్తే అడుగుదాం— ఆయన తినమంటే తిందురు కాని."

"ఇంత ఆవకాయ కారం కలుపుకుని కాచిన నెయ్యి వేసుకుని తింటాను. గుత్తి వంకాయకూర వండు. చక్కగా పప్పు చారు పెట్టు. అప్పడాలు వేయించడం మరిచిపోకు. ఇంత ఉసిరికాయ పచ్చడి కూడా పెట్టు."

"ఉసిరికాయ పచ్చడి తప్పకుండా పెడతాను. తక్కినవి వద్దు."

"అలా అంటే నేను తినను."

"తినకండి ఇవ్వాల్టికి."

ఇలా సాగింది సంభాషణ.

తీరా డాక్టర్ వొచ్చి అన్నం తినొద్దన్నాడు.

ఆ డాక్టర్ పై పట్టుకుని పీక పిసికేద్దా మనుకున్నాడు.

మధ్యాహ్నం వేపుడు జావ తాగి పడుకున్నాడు. లేచేసరికి కొంచెం జ్వరం తగిలింది. మహా ఉంటే తొంభయి తొమ్మిదిన్నరో, నూరో ఉండొచ్చు టెంపరేచర్.

"చూశారా—ఉష్ణం వచ్చేసింది మళ్ళీను. అన్నం తినేస్తానన్నారు" అన్నది రాజేశ్వరి, నుదుటిమీద

చెయ్యి వేసి చూసి.

అలా జరిగిపోయింది నిన్న.

క్రమం తప్పకుండా మాత్రలు మింగించింది రాజేశ్వరి.

తెల్లారి చూసుకుంటే ప్రాణం చాలా తేలిగ్గా ఉన్నట్లనిపించింది. మొహం కడుక్కుంటుంటే ఇంత పసరు పడింది. ఆ తరవాత మరీ సుఖంగా ఉంది.

"ఇహ నీ వెధవ మాత్తర్లు మింగను. మింగీ మింగీ కడుపు పసరు పోయి కూడాను— దరిద్రం" అన్నాడు.

అతనికి అల్లోపతీ మాత్రల మీద—అంటే ఇంగ్లీషు మాత్రల మీద—అట్టే నమ్మకం లేదు.



హోమియోపతి మీద నమ్మకం ఉంది. కాని ఆ మందు లిచ్చే డాక్టర్లు అంత సులభంగా దొరుకుతారా? పైగా ఆ హోమియోపతి మాత్రలతో వచ్చిన చిక్కు—ఒకోసారి వెంటనే గుణం చూపించదు.

రాజేశ్వరి బలవంతం మీద రెండు మాత్రలు మింగి, కాఫీ తాగాడు.

ఇవ్వాళ డాక్టరు తినొద్దన్నా అన్నం తినేస్తానని చంటి పిల్లాడి లాగా మారాం మొదలు పెట్టాడు.

"ఆకలి దంచేస్తోంది. రెండిడ్లీ, కొబ్బరి చట్నీ వేయించి తెప్పించు" అన్నాడు భార్యతో.

పనుల సందడిలో ఆ మాట ఆమె చెవిన పడలేదు.

"ఒరే, బాబిగా, జేబులో డబ్బు లున్నాయి. తీసుకెళ్ళి రెండిడ్లీ—కొబ్బరి చట్నీ వేయించి పట్రా. కావాలంటే నువ్వూ నీ క్కావలసిన టిఫిను తిను—సరేనా" అన్నాడు.

బాబిగాడు బుద్ధిగా పుస్తకం పట్టుకుని కూచున్న వాడల్లా ఎగిరి గంతు వేసినంత పని చేశాడు.

ఇంతట్లో రాజేశ్వరి వచ్చి ఆ మాట విన్నది.

"ఇంకా నయం. పూర్ణం తిరగ బెడుతుంది. హార్లిక్స్ కొంచెం ఎక్కువగా కలిపి ఇస్తాను—తాగండి" అన్నది నవ్వుదాయనున్నట్లు.

బాబిగాడు ఏమీ ఎరగనట్టు పుస్తకం పట్టుకున్నాడు మళ్ళీ.

"తవ్వెడు హార్లిక్సు తాగమన్నావా? ఘన పదార్థం పడందే ఆకలి అణుగుతుందా?" అన్నాడు కోపంతో.

"అనవసరంగా గట్టిగా మాట్లాడకండి. కళ్ళు మూసుకుని పడుకుని విశ్రాంతి తీసుకోండి" అన్నది శాంతంగా.

ఆ 'విశ్రాంతి' అనే మాట వినేసరికి అతనికి మరింత కోపం వచ్చింది.

"విశ్రాంతి— విశ్రాంతి— కనీసం ఏమీ తిననన్నా లేదే? ఎందుకు విశ్రాంతి! ? ఏం కష్ట పడ్డానని విశ్రాంతి!" సర్రున లేచాడు.

"నీరసం కోపం" అనుకుంటూ వంట గదిలోకి వెళ్ళిపోయింది రాజేశ్వరి. ఎదురుగా ఉంటే ఆ కోపం, ఆ వాగుడూ మరింత ఎక్కువై పోతాయన్నది ఆమెకు అనుభవమే.

డాక్టరు అన్నం తినమన్నారు. చల్లని మాట విన్నారు ఇన్నాళ్ళకి.

"కాస్త చారూ అన్నం తిందురు కాని లెండి" అన్నది రాజేశ్వరి.

ఒళ్ళు మండిపోయింది.

"ఏ గుత్తి వంకాయ కూరో, టొమాటో పప్పు కాస్త వోటి. రుచిగా ఏదన్నా తినకపోతే నేను బతకను" అని గట్టిగా కేక లేసేద్దామనుకున్నాడు.

కోపం ఆపుకుని, డాక్టర్ వెళ్ళగానే భార్యతో "ఏం కూర వండుతావూ?" అనడిగాడు సాధ్యమైనంత శాంతంగా.

"రెండు చిన్న చిన్న బీరకాయ లున్నాయి. మీకు కూర వండుతాను. పథ్యానికి మంచిది" అన్నది.

"నువ్వూ,-బాబిగాడూకూడా అక్కూ తింటారా?"

"అబ్బే! ఏం సరిపోతుందీ? చాలదు. ఇంట్లో కూరల్లేవు. ఎవరున్నారు తీసుకురావడానికి? ఆ బీరకాయ లయినా మొన్న వీధి లోకి వస్తే కొన్నాను. బాబిగాడు కూరలు బేరం చేసి తీసుకు రాలేడు. ఇహ ఇటువంటి పనులు బతిమాలాలి. ఎందుకొచ్చిన గొడవని కాలక్షేపం చేసేస్తున్నాను."

"పదేళ్ళ వెధ వున్నాడు. బజారు కెళ్ళి కూరలు బేరం చేసి తీసుకు రాలేడా?" అని కొడుకు మీద విరుచుకున్నాడు.

"వాడి మొహం" అంటూ వంట గదిలోకి వెళ్ళిపోయింది రాజేశ్వరి.

లేచి నిలబడి అద్దంలో చూసుకున్నాడు. గడ్డం పెరిగిపోయింది. తడిమి చూసుకున్నాడు. చాలా చిరాకనిపించింది. మెల్లిగా నడుచుకుంటూ వంట గదిలోకి వెళ్ళి "చిన్న గిన్నెతో గోరు వెచ్చని నీళ్ళుంటే ఇయ్యి" అన్నాడు. ముందు గదిలోంచి వంట గదిలోకి నడిచేసరికే నీరసం అనిపించింది.

"ఎందుకూ?" అన్నది రాజేశ్వరి.

"గడ్డం గీసుకుంటాను."

"ఇవ్వాళ వద్దు—రేపు గీసుకుందురు కాని. గీసుకుని స్నానం చేద్దురు కాని. చేసి రిక్షా మీద ఆఫీసుకు వెళుదురు కాని."

"ఇవ్వాళ గీసుకుంటే ఏం?"

"పదిన్నర కావస్తోంది. ఇంత ఎండెక్కి గీసుకుంటే ఏం బాగుంటుంది? అయినా నీరసంతో ఏం గీసుకుంటారూ?"

"పోన్లే సాయంత్రం గీసుకుంటాను."

"ఛీ. ఛీ. సాయంత్రం గడ్డం గీసుకోవడమా?"

"నీకూ గడ్డం ఉండి, అది చిరాగ్గా పెరిగిపోతే అప్పుడు నీకూ తెలిసి వుణ్ను. నీకేం? నువ్వు చెబుతావు' అన్నాడు రోషంగా.

అతని మాటలు విని కూర పోపు పెడుతూ రాజేశ్వరి మౌనంగా నవ్వింది. మనోహరంగా నవ్వింది. అంత నీరసంలోనూ ఆమె నవ్వు చూసి కృష్ణమూర్తి మనసు మెలికలు తిరిగిపోయింది.

కూర తాలింపు వాసన ముక్కుపుటాలకు సోకి నోరూరిపోయింది.




వీధిలోంచి పనసపొట్టు, పనస పొట్టు అని కేకలు వినిపించాయి. జారిన పైట సరిచేసుకుంటూ రాజేశ్వరి వీధిలోకి పరుగు తీసింది. ఒక పావలా పొట్టు కొన్నది.

"అంత కొంచెం కొన్నావేం? మరి కొంచెం కొనలేక పోయావా?" అన్నాడు పనసపొట్టు వేపు ప్రేమగా చూస్తూ.

"ఎందుకు? ఇది చాలు. రెండు పూటలకీ సరిపోతుంది" అంది.

కృష్ణమూర్తికి ప్రాణం ఉసూరు మనిపించింది. పనస పొట్టంటే అతనికి వల్లమాలిన ఇష్టం. ఏమిటి సాధనం? పథ్యం నాడు పనసపొట్టు కూర పెట్టరు కదా?

రాజేశ్వరి పనసపొట్టు కూర వండుతున్నంత సేపూ ఆ నీరసంతో అలాగే వంటింట్లో కూచున్నాడు. కూర ఉడుకుతుంటే ఆ సువాసన ఘుమ ఘుమ లాడిపోయింది.

"పూర్వం ఒక ఋషి పరమేశ్వరుడి కోసం ఘోరమైన తపస్సు చేశాడట. చివరికి పరమేశ్వరుడు

ప్రత్యక్షమై ఆతని తపస్సుకు మెచ్చి ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. బుషి తడుముకోకుండా గుత్తి వంకాయకూర, పనసపొట్టు కూర, టొమాటో పప్పు—ఈ మూడూ కావలసినప్పుడల్లా తినే వరం ప్రసాదించమని వేడుకున్నాడట. పరమేశ్వరుడు భక్తుడి వింత కోరిక విని అయోమయంలో పడిపోయి, వరం ఇచ్చేసి మాయమైపోయాడట" అని కథ చెప్పాడు.

రాజేశ్వరి నవ్వింది.

"ఆ బుషి ఎవరనుకున్నావూ?" అన్నాడు.

"ఇంకెవరూ—గత జన్మలో ఆ బుషి మీరే అయి ఉంటారు" అన్నది నవ్వుతూ.

కృష్ణమూర్తి కూడా నవ్వాడు. ఇద్దరికీ కళ్ళు నీళ్ళొచ్చాయి.

"సరే, ఇక లేవండి. పదకొండు కూడా దాటింది. పొయ్యి మీద వేడినీళ్ళు పడేస్తాను. మొహం, కాళ్ళూ చేతులూ వేణ్ణీళ్ళతో కడుక్కుని, ఇస్త్రీ లుంగీ పంచె కట్టుకుని, ఉతికిన బనీనిస్తాను— తొడుక్కోండి" అన్నది.

లేచి తలకి ఇంత కొబ్బరి నూనె రాసుకుని మర్దనా చేసుకున్నాడు. కళ్ళలోంచి ఆవిర్లు వచ్చాయి. వేడినీళ్ళు పెట్టి మొహం, కాళ్ళూ చేతులూ కడుక్కున్నాడు. తెల్లటి ఇస్త్రీ లుంగీ పంచె కట్టుకుని, ఉతికిన బనీను వేసుకున్నాడు. ప్రాణం హాయిగా ఉంది.

బీరకాయ కూర, చారూ వేసుకుని అన్నం తిన్నాడు. మిరియాల పొడి వేసిన కాచిన చారు చాలా రుచిగా ఉంది. ఇంత ధనియాల కారం కూడా వేసుకున్నాడు. గుప్పెడు అన్నం తినేసరికే కడుపు నిండిపోయి పట్టేయిపోయింది. కడుపులో పేగులు అరిచాయి. కళ్ళు మూతలు పడిపోయాయి, కంచం దగ్గిరే.

'వెధవ శరీరం. తిన్నా చిక్కే, తినకపోయినా చిక్కే' అనుకున్నాడు చెయ్యి కడుక్కుంటూ.

"నిద్ర పోకండి" అన్నది రాజేశ్వరి.

"ఛ. ఛ. పగటి నిద్ర నాకు అలవాటే లేదు" అన్నాడు ఆవలిస్తూ.

వాలుకుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా చిన్న స్టూలు మీద కాళ్ళు పెట్టుకున్నాడు. ఏమీ తోచడం లేదు. చదివి పడేసిన పేపరే మళ్ళీ తీసి చదవటం ప్రారంభించాడు.

"బూలాస్త్రభూశ కులదప్పె—నటద్భాఉ ధింగారదింశ" హెడ్డింగులన్నీ తిరగేసి చదువుకున్నాడు.

"శివా అనామావి కారిమెంఅ స్సై ంత్నాయువి—"

రాజేశ్వరి పడీ పడీ నవ్వుతోంది.

"మీకు పుణ్యం ఉంటుంది. ఆపు చెయ్యండి, బాబూ. నవ్వలేక చస్తున్నాను. ఇప్పుడే అన్నం తిన్నాను కూడాను" అన్నది రాజేశ్వరి వంట గది తలుపులు వేసి ఇవతలికి వస్తూ.

ఒక లైను పుచ్చుకుని ఆ లైను వెంట అన్ని కాలాల్లోని వాక్యాలు కలిపి చదివేస్తున్నాడు.

రాజేశ్వరి ఇక నవ్వలేక గోడకి చేరబడి పోయింది.

ఆమె నవ్వు చూసి ఏదో పని మీద వచ్చిన పక్కింటి వాళ్ళబ్బాయి శీను అలాగే నిలబడి పోయి చూస్తున్నాడు. అయిదేళ్ళు వాడికి. సినిమా పాటలన్నీ తడుముకోకుండా పాడేస్తాడు. ఆరు నెల్ల నుంచీ అఆలు మాత్రం వచ్చేయి కావు.

వాణ్ణి దగ్గిరికి పిలిచాడు.

"ఇవ్వాళ మీ ఇంట్లో ఏం కూర?" అనడిగాడు.

"మామిడికాయ పప్పు" అన్నాడు వాడు.

"ఇంకా..."

"కొబ్బరికాయ పచ్చడి"

రాజేశ్వరి వాడిని పిలిచింది. "ఇలా రా. ఏం వచ్చావూ?" అనడిగింది.

వాడు చెడ్డీ ఎగ దీసుకుంటూ వచ్చి "మా అమ్మ ఏదన్నా పుస్తకం ఇమ్మంది" అన్నాడు. పోయిన వారం పత్రిక తెచ్చి ఇచ్చింది. వాడది పట్టుకుని లేచి పోయాడు.

కృష్ణమూర్తి కళ్ళు మూసుకుని ఆవలించాడు.

"నిద్ర వచ్చేస్తున్నట్టుంది మీకు. ఎదురింటి అమ్మాయి నడిగి డిటెక్టివ్ పుస్తకాలు తెచ్చిమ్మన్నారా?" అన్నది.

ఎదురింట్లో ఉన్న మాధవి బి. ఏస్సీ చదువుతోంది. డిటెక్టివ్ పుస్తకాలు తెగ చదువుతోంది.

"కొత్త పుస్తకాలొద్దు. పాతవి చూసి పట్రా. పాత డిటెక్టివ్ నవలలు ఉంటే పట్రా" అన్నాడు.

నూతన యవ్వనం పొందండి
సంతానవంతులు కండి. చర్మవ్యాధుల
నుండి విముక్తులు కండి.



హస్త ప్రయోగము వలన కలుగు
నరముల బలహీనత, శీఘ్రస్ఖలనము
అంగము చిన్నదగుట, అవసర
కాలమందు అసంతృప్తి.
సంతానము లేక పోవుట, సమస్త
చర్మవ్యాధులకు అద్భుత చికిత్స
పొందు ద్వారా చికిత్స కలదు.

క్యాంపులు: ప్రతి ఆదివారం భీమవరం. షణ్ముఖలాడ్జి నందు
ఉ॥ 8 గం॥ నుండి సా॥ 6-30 గం॥ వరకు ప్రతినెల 1, మరియు
16 తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సర లో
మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9 గం॥ వరకు

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేద బిషక్, సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్
పార్కు రోడ్, గుడివాడ-521 301
ఫోన్స్ 522 అండ్ 540

ముస్తాబులో మార్పు!





సరిక్రొత్త
ఆకర్షణీయమైన సీసాలలో
లోధ్ర
బాధారహిత
ఆరోగ్యమును స్త్రీలకు
80 సంవత్సరములుగా
ఇచ్చుచున్నది.
ఉచిత వైద్య సలహాకు ఈ
కూపనును పూర్తిచేసి
పంపండి.

పేరు: ..............................
విలాసము: ..............................
..............................PIN..........

ఏజంట్లు:
శీతారామ జనరల్
స్టోర్స్ ఏజన్సీస
విజయవాడ —సికింద్రాబాద్

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14




"ఇక్కడున్నట్టు రానూ ఆలస్యం చేస్తే మీరు కునుకు తీస్తారు" అని ఎదురింటికి బయలుదేరింది.

పాత డిటెక్టివ్ నవలే తెచ్చింది. ఎంత చక్కని టైమ్! చదవడం ప్రారంభించాడు.

రాజేశ్వరి సీరియల్ నవల చదువుతూ నిద్రపోయింది.

లేచేసరికి నాలుగున్నరయింది.

ఎదురుగా కృష్ణమూర్తి వాలు కుర్చీలో కనిపించాడు. ప్రాణం కుదుట పడింది. మొగుడు ఎక్కడ నిద్ర పోయాడో నని కంగారు పడి పోయింది.

వంటింట్లోకి వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చింది.

"ఏమండీ, పనసకాయ కూర తినేశారా?"

"ఛీ ఛీ. నే నెందుకు తింటాను. వూష్ణం వచ్చి ఇవ్వాళే తగ్గింది. ఏ పిల్లో, కుక్కో తినేసి ఉంటుంది."

"నేను తలుపులన్నీ వేసి మరీ పడుకున్నాను. పైగా కూరగిన్నె చిక్కం బీరువాలో కూడా పెట్టాను. బుకాయించకండి."

"నేను తినలేదని చెబుతుంటే నీ క్కాదూ" అన్నాడు గోడ వేపు తిరిగి.

"నా కేం మళ్ళీ ఏదన్నా ముంచుకొస్తే మీరే బాధ పడతారు కాని, నా వల్ల కాదు" అన్నది విసుగ్గా.

"కొంచెమే కదూ తిన్నాను కొంప మునిగే దేమిటే?"

"ఉష్ణం వచ్చిన మనిషి మొదటి పథ్యం నిండా ఒంట పట్టకుండా పనసకాయ కూర తినేస్తారా? వేడి చేసి" అని ఇక కోపం పట్టలేక ఆగిపోయింది.

"అందుకనే రెండు అరటి పళ్ళుకూడా తిన్నాను."

"ఏమిటే అరటిపళ్ళు కూడా తిన్నారా? ఎక్కడివి?"

"గూట్లో కనిపించాయి."

"హయ్యో రాత. మీరేమన్నా చిన్న పిల్లలా కసకసా ఒక దెబ్బ వేసో, కసిరో చెప్పడానికి? చెట్టంత మనిషి. చెప్పినట్టు వినక పోతే ఎలా చావడం అంతా మీ మంచికే కదూ?"

కోపంగా ఇటు వేపు తిరిగాడు.

"ఏమిటి మంచి? ధనియాల కారం, బీరకాయ కూర తినడం మంచా కారం రోజుల్తై నోరు చచ్చిపోయి ఏడుస్తున్నానే కొంచెం అయినా ఆలోచించావా?"

అప్పుడు గమనించింది. గడ్డం మున్నగా గీసుకున్నాడు.

"గడ్డంకూడా గీసుకున్నారా?"

"కనపడ్డం లేదూ?"

నవ్వాలో, ఏడవాలో బోధ పడలేదు రాజేశ్వరికి.

ఈ మంత్రం. బడి నుం... కుర్ర వెధవ లెక్కల చెప్పమని అడిగాడు. ఒక్కసారి లెక్కల పుస్తకం తిరగేశాడు.

అయిదో క్లాసు గుంట వెధవలకి అంతేసి పలా పుస్తకాలే లెక్కలంటే ఒళ్ళు మంట కృష్ణమూర్తికి.

"ఉష్ణం వచ్చి ఇంకా ఇవ్వాళే తగ్గిందిరా. నీరసంతో నేనే ఏడుస్తుంటే నువ్వేమి ట్రా నా ప్రాణానికి" అని కొడుకుని కసురుకున్నాడు.

వాడు ఒక్క చచ్చి పుస్తకం పట్టుకుని తల్లి దగ్గిరికి వెళ్ళాడు.

రాత్రికి మామూలుగా విసుక్కుంటూ రొట్టె, పాలు తీసుకున్నాడు.

"పక్కింటివాళ్ళు సినిమాకి వెళ్ళారు. పిలిచారా కూడాను. మిమ్మల్ని వదిలి ఎలా వెళ్ళను. ఒకవేళ మొండి కెత్తి వెళ్ళా ననుకోండి. ఆవకాయ జాడీ ఖాళీ చేసేస్తారు. లేదా అప్పడాలన్నీ వేయించుకు తినేస్తారు. ఏమన్నా ఉంటే నోరు చచ్చి పోయిం దంటారు" అన్నది రాజేశ్వరి.

"చ చ అలా ఎందుకు చేస్తానూ? వెళ్ళలేక పోయావా?"

"వూష్ణం వచ్చిన మనిషిని మిమ్మల్నొక్కళ్ళనీ వదిలేసి నేను సినిమాలకీ, షికార్లకీ వెళ్ళడం?"

"వూష్ణం వూష్ణం వూష్ణం వెధ వూష్ణం. ఏ నాడో తగ్గిపోయిందిగా. నేను నిక్షేపంలా ఉన్నాను. కావాలంటే ఇరుగూ పొరుగూ జనాన్ని కూడగట్టుకుని సెకండు షోకి వెళ్ళు."

"హవ్వ" అని నోరునొక్కుకుని రాజేశ్వరి అక్కడితో మాట తుంచేసింది.

ఆ రాత్రి రేడియో లోంచి హాస్య నాటిక వస్తూంది. కృష్ణమూర్తి మంచానికి చేరబడి కూచుని వింటూ మధ్య మధ్యలో నవ్వుతూంది.

నవ్వుతూంటే ఆమె గుండె మృదువుగా ఎగిరెగిరి పడుతూంది. కృష్ణమూర్తి ఒక్క క్షణం చూపు నిలిపి

"అబ్బ! ఎంత అందంగా ఉన్నావు ఇవ్వాళ నువ్వు" న్నాడ ఆమె చేతులు తీసి గుండెల మీద పెట్టుకుంటూ.

"ఆఁ. చాలు చాలు సరసాలు" అని దూరంగా జరిగి కూచుంది.

"చూడండి సార్. ఇవ్వాలే మీకు వూష్ణం వచ్చి తగింది. ఒక్క పూటే పథ్యం తిన్నారు. రెండో పూట తిననే లేదు. అది కొంచెం గుర్తుంచుకుని రెండు రోజుల పాటు "అని మాట పూర్తి చెయ్యనే లేదు, వెంటనే అందుకున్నాడు.

"అబ్బబ్బబ్బ! దిక్కుమాలిన వూష్ణం. ఏ నాడో తగ్గిపోయింది. నువ్వు మాత్రం తగ్గనివ్వడం లేదు అన్నాడు కృష్ణమూర్తి తల పట్టుకుని.

"బాబిగాడు లెక్కలు చెప్పమని దగ్గిరికి వస్తే వూష్ణం ఇవ్వాళే తగ్గిందిరా. నీరసంతో చస్తుంటే నా ప్రాణం తియ్యకురా అని కసిరారు కదా అప్పుడు లేదా నీరసం?" అని దెప్పింది రాజేశ్వరి.

రాజేశ్వరా మజాకాలా?"

మారు మాట్లాడ లేదు కృష్ణమూర్తి. *